స్వేచ్ఛా విహంగాలు

విశ్వకవి రవీంద్రుని స్ట్రే బర్డ్స్

తెలుగు అనువాదం:

బొల్లోజు బాబా

స్వేచ్ఛావిహంగాలు

(విశ్వకవి రవీంద్రుని స్ట్రే బర్డ్స్)

తెలుగు అనువాదం:

బొల్లోజు బాబా

9849320443

స్వేచ్ఛావిహంగాలు

(విశ్వకవి రవీంద్రుని స్ట్రే బర్డ్స్)

– బొల్లోజు బాబా

రచనాకాలం: 2009

ప్రచురణ: జూన్ – 2016

వెల: రు. 75/–

కాపీల కొరకు:

బొల్లోజు బాబా
30–7–31
సూర్యనారాయణ పురం
కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా
ఫోన్: 0884/2368189
9849320443

ముఖచిత్ర పెయింటింగ్: శ్రీ వాడ్రేవు చిన వీరభద్రుడు

డిజైన్: ముమ్మిడి చిన్నారి

ముద్రణ: అభిసారిక ప్రెస్, సామర్లకోట

చక్కని కానుక

ఇప్పుడు కవిత్వం రాస్తున్నవాళ్ళలో బొల్లోజు బాబా కొంత ప్రత్యేకంగా కనిపిస్తున్నాడు. అతణ్ణి ఒక ఉపాసకుడిగా అభివర్ణించవచ్చు. ఎవరేనా గొప్ప కవిత్వం రాయడం అలా ఉంచి, అసలు ముందు కవికావాలంటే కూడా తీవ్ర సాధనా, ఉపాసనా తప్పనిసరి. తనంతట తానుగా చెప్పాలనుకున్నది మాత్రమే కాదు, తన పూర్వకవులు ఏం చెప్పారో, ఎట్లా చెప్పారో తెలుసుకోవాలన్న తపన కూడా ఆ ఉపాసనలో భాగమే.

కవిత్వం ఒక individual utterance మాత్రమే కాదు, అది తరం నుంచి తరానికి, యుగం నుంచి యుగానికి ప్రసరించే, అగ్నిధార కూడా. అందుకనే వాక్కులన్నిటికన్నా ప్రాచీనమైన ఋగ్వేదంలో, మొదటి సూక్తంలోనే, అగ్నిని ఆహ్వానిస్తూ 'అగ్నిః పూర్వేభిః ఋషిభిః ఈడ్యో నూతనైః ఉత ' అన్నారు. కొత్తగా గొంతు విప్పుతున్న ప్రతి కవిలోనూ పూర్వకవులే మరోసారి గొంతు సవరించుకుంటున్నారు. పూర్వమార్గం నుంచి తప్పుకుని కొత్త పంథా వేసారని చెప్పుకునే కవుల కొత్త పంథాలో కూడా ఎవరో ఒక పూర్వకవి తొంగిచూస్తూనే ఉంటాడు.

పూర్వకవుల్ని అధ్యయనం చేసే కవి, వారిని తిరిగి తన వాక్కులోకి అనుసృజించుకునే కవి జన్మ ధన్యం. ఎందుకంటే అతడు పూర్వతరాల జీవితమంతా మరోసారి జీవిస్తున్నాడు. అట్లాంటి కవి ఆయుర్దాయం గొప్పది, భావనాబలం గొప్పది, అనుభూతి సాంద్రత గొప్పది.

బొల్లోజు బాబా తన ఉపాసనలో ఎందరో పూర్వమహాకవుల సాన్నిధ్యసుఖాన్ని అనుభవిస్తూనే ఉన్నాడు. రూమీనుంచి నెరూదా దాకా. ఇప్పుడు టాగోర్.

2

గాంధీ రచనల్లో ఎక్కడన్నా 'కవి 'అనే పదం కనిపిస్తే అది టాగోర్ అనే అర్థం. కాళిదాసు వాల్మీకి ని మాత్రమే కవి అని సంబోధించినట్టు. కాని టాగోర్ ని మనం కవి అంటున్నప్పుడు, అతడి సమకాలికులైన పాశ్చాత్య, ప్రాచ్యకవులు,యేట్సు, ఇలియట్, ఎజ్రా పౌండ్ లేదా మైథిలీ శరణ్ గుప్త, నజ్రుల్ ఇస్లాం,ఇక్బాల్, గురజాడల కన్నా ఆయన చాలా ప్రత్యేకమైన కవి అని గుర్తుపెట్టుకోవాలి.

నిజానికి సాంప్రదాయిక, ఆధునిక అర్థాల్లో మనం గుర్తించే కవి లాంటి వాడు కాదు టాగోర్. తులసీదాస్, కంబర్, పెద్దన ల్లాంటి కవి కాదు అతడు. ఆయన ఒక వాగ్గేయకారుడు. నామదేవ్,కబీర్,అన్నమయ్య, త్యాగయ్య ల్లాగా ఒక సంకీర్తనాచార్యుడు, భక్తి కవి. ఆయన కవితలు రాసిన కవి కాదు, పాటలు కట్టుకున్న గాయకుడు. ఆ పాటలో భావాలు ఎంత ముఖ్యమో, రాగమూ, లయ కూడా అంతే ముఖ్యం. ఆ మాటకొస్తే, భావలకన్నా, సంగీతమే ఎక్కువ ప్రధానం. కొత్త భావాల్ని చెప్పటం మీద ఆయనకు దృష్టి లేదు. 'ప్రాగ్విపశ్చిన్మతంబున రసము వేయి రెట్లు గొప్పది నవ కథాధృతిని మించి' అనే తూర్పుదేశాల ఆలంకార శాస్త్రం ఆయనది.

ఉదాహరణకి ఈ గీతం చూడండి:

మొహాబిశ్వే మొహాకాశే మొహాకాల్ మాఝే
ఆమి మానొబ్ ఎకాకి భ్రొమి బిస్మొయె, భ్రొమి బిస్మొయె
తుమి ఆఛో, బిస్వొనాథ్, ఒసీమ్ రొహొస్యొమాజే
నీరొబె ఎకాకి ఆపోన్ మొహిమానిలొయె.
ఒనొంతొ ఏ దేశ్ కాలే,ఒగొణ్యొ ఏ దీప్తొ లోకే
తుమి అఛోేమొరే చాహి–అమి చాహి తొమా–పానె.
స్తొబ్ధొ షోర్బొ కొలాహొల్ శాంతిమొగ్నొ చొరాచొర్
ఎక్ తుమి, తొమా మాజే అమి ఎకా నిరొరొయె.

ఇందులో కొత్త భావాలు, బుద్ధిని స్పందింపచేయగల అంతర్దృష్టి, మిరుమిట్లు గొలిపే రూపకాలంకారాలూ ఏవీ లేవు. కాని ఆకాశంలోని వైశాల్యం, సాయంసంధ్యలోని గాంభీర్యమంతా ఈ గీతంలో కనిపిస్తుంది. ఇక్కడ కవిత మరేదో భావాల్ని, సత్యాల్ని తీసుకొచ్చే ఒక వాహిక కాదు. దానికదే ఒక సంపూర్ణ, సమగ్ర అనుభవం. ఆ పాట వింటూనే మనం లోనుకాగల అనుభవమే ఆ కవిత సందేశం.

ఆయన ప్రధానంగా గీతకారుడు. సంగీతమయం కాని కవితతో ఆయన భగవంతుణ్ణి సమీపించడానికి ఇష్టపడలేదు.

'పాడమని నీ ఆజ్ఞ అయినప్పుడు గర్వంతో నా గుండె పగులుతుందేమో ననిపిస్తుంది..నా బతుకులో కర్కశమైందీ, అపభ్రంశమైందీ సంగీతమాధుర్యంలో కరిగిపోతుంది. నా పాటంటే నీకు ఆనందమని తెలుసు. గాయకుడిగానే నీ సమక్షానికి నా ప్రవేశమని

తెలుసు. ఎన్నటికి నేను నాకుగా అందుకోలేని నీ పాదాల్ని నా గానపక్షాంచలంతో స్పృశించగలుగుతాను. గానోన్మత్తుడై నన్ను మరిచి నా ప్రభువైన నిన్ను 'నా సఖా ' అని పిలుచుకుంటాను ' (గీతాంజలి, 2 అను.చలం)

అని అంటాడు.

ఇటువంటి గీతకారుడు టాగోర్ చైనా, జపాన్ యాత్రల తరువాత కొత్త ప్రక్రియలో కొన్ని కవితలు రాసాడు.

ఇప్పుడు మీ చేతుల్లో ఉన్న 'స్వేచ్ఛావిహంగాలు' ఆ కొత్త ప్రక్రియలో వెలువడ్డ Stray Birds (1916) కి అనుసృజన.

నిజానికి ఈ ప్రక్రియ టాగోర్ చైనానుంచో, జపాన్ నుంచో నేర్చుకున్నది కాదు. ఈ తరహా కవిత్వానికి ఆయన తన తొలిరోజుల్లోనే శ్రీకారం చుట్టకపోలేదు. 'కణిక' అనే పేరిట ఇటువంటి కవితల్ని ఆయన 1899 లోనే వెలువరించాడు. కాని ఆ ప్రక్రియ ఆయన ప్రధాన ప్రక్రియగా మారలేదు. కాని అటువంటి తరహా కవిత్వం భారతీయ సాహిత్యంలో కొత్త కాదు, సంస్కృత ముక్తకాలు, హిందీ దోహాలు, పారశీక పద్యాల్లోని ద్విపదలు టాగోర్ కి తెలియనివి కావు.

కాని సంస్కృతం, పారశీకం, హిందీ,బెంగాలీలలో కనిపించే ముక్తకాల్లో భావంతో పాటు ఛందస్సూ, సంగీతమూ కూడా ప్రధాన పాత్ర వహిస్తాయి. అయితే ఈ కొత్త తరహా ప్రక్రియలో ఛందస్సుకీ, సంగీతానికీ ప్రాధాన్యత తక్కువ. ఇవి మనసులో తటిల్లున మెరిసే ఆలోచనల్ని తట్టినవి తట్టినట్టుగా మనతో పంచుకునే ప్రయత్నం.

వీటివెనక రెండు ప్రేరణలున్నాయని మనం భావించవచ్చు. ఒకటి, తన 'లేఖన్' (1926) సంపుటికి ముందుమాటలో టాగోర్ రాసుకున్నట్టుగా చీనాయాత్రనే.అక్కడ ఆయన్ను అభిమానులు పట్టువస్త్రాలమీదా, చిన్ని చిన్ని విసనకర్రలమీదా కవితలు రాయమని అడిగినప్పుడు తానా పంక్తులు రాసానని ఆయన చెప్పుకున్నాడు.

కాని ఆయన స్పష్టంగా చెప్పకపోయినా, రెండవ ముఖ్యమైన ప్రేరణ, ఆధునిక వచన కవిత. ఆయన సాంప్రదాయిక పద్యకవీ, లేదా ఆధునిక వచనకవీ కాడు. ఆయన గీతకర్త. సంగీతకర్త. కానీ, ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలో ప్రపంచమంతా వరదలాగా ముంచెత్తుతున్న ఆధునిక వచన కవిత గురించి ఆయన విన్నాడు. తన

గీతాలు అంతదాకా రససమ్మోహితంగా మాత్రమే కాక, నిర్దిష్ట రూపసౌష్టవంతో కూడా వికసిస్తున్నాయని ఆయనకి తెలుసు. తన గీతాల్లోని రూపశిల్పాన్ని పక్కన పెట్టి, తన భావాలతో అదే రసస్ఫూర్తి కలిగించగలడా?

ఆ ప్రశ్న ఆయన్ని 1916-26 మధ్యకాలంలో తీవ్రంగా వెన్నాడింది. ఆ తర్వాత ఆయన రాసిన కవిత్వమంతా ప్రధానంగా వచన కవిత్వమే. ఆ కొత్తధోరణి ఆయన 'బలాక ' (1916) నుంచే కనిపిస్తున్నదని బుద్ధదేవ్ బోస్ అంటాడు. 1922 లో ప్రచురించిన 'లిపిక' పూర్తి వచనకవితాసంపుటి కావడం కూడా గమనించాలి.

Stray Birds వెనక హైకూ ప్రభావం ఉందని కృష్ణ క ృపలానీ అభిప్రాయపడ్డాడు. 1916 లో రాసిన జపాన్ డైరీలో టాగోర్ హైకూ గురించి చాలా ఆసక్తికరమైన పరిశీలనలు పంచుకున్నాడు. (ఈ డైరీని తెలుగులోకి అనువదించిన రాయప్రోలు సుబ్బారావు, దురదృష్టవశాత్తూ ఆ భాగాల్ని అనువదించకుండా వదిలేసారు). ఇప్పటికీ ఇంగ్లీషులోకి అనువాదం కాని, ఆ రచనలో హైకూ మీద పరిశీలనల్ని అమృత సేన్ అనే ఆయన Rabindranath Tagor and Haiku అనే తన వ్యాసం కోసం అనువదించాడు. అందులో టాగోర్, ఒక జాతిగా జపనీయుల విశిష్టత వారు తమలోని పరస్పర విరుద్ధమైన రెండు శక్తుల మధ్య సాధించుకున్న సమన్వయంలో ఉందని, రాసాడు.

ఒకవైపు తమని తాము అభివ్యక్తపరుచుకోవాలన్న ఉత్సాహం, మరొకవైపు తమ మీద తాము విధించుకునే సమన్వయం-దీన్నే ఆయన జపనీయుల ధీరత్వంగా పేర్కొన్నాడు. ఒక ప్రక్రియగా హైకూ ఈ ఆత్మనిగ్రహానికి అద్దం పడుతున్నదని టాగోర్ భావించాడు.

'...వారి హృదయాలు ఉరకలెత్తే కొండవాగులాగా గలగల్లాడవు. లోతైన కాసారజలాల నిశ్శబ్దం వారిది. వారి కవిత్వం జీవితాన్ని గాఢంగా దృశ్యమానం చేస్తుంది. మానవ భావావేశాలమీద గొప్ప నియంత్రణ కనిపిస్తుందందులో. అలాగని వారి సౌందర్య సంవేదనలేమీ తక్కువ కాదు. వారి సౌందర్య దృష్టిలో ఎంత పారవశ్యం ఉందో,అభివ్యక్తిమీద అంత సంయమనం కూడా ఉంటుంది '

అని రాసాడాయన తన జపాన్ డైరీలో.

ఇది టాగోర్ లో కలిగిన కొత్త మెలకువ. అంతదాకా ఆయన రాసిన పాటల్లో

ప్రవహించడం,జలపాతంలాగా ఎగిసిపడటం, శ్రావణమేఘం లాగా వర్షించడం మాత్రమే ఉండేవి. అప్పట్లో ఆయన దృష్టిలో రూపం రసానికి వాహిక మాత్రమే. కాని రూపంతో ప్రయోగాలు చెయ్యవచ్చుననీ, రాగానికి తాళంలాగా, రూపం రసవిస్ఫోటనానికొక చౌకట్టు సమకూరుస్తుందని ఆయన గుర్తుపట్టాడు. ఈ నవీన జాగృతిలోంచి పుట్టుకొచ్చినవే Stray Birds (1916), Lekhan (1926), Fireflies (1928), Sphulimga (1946) సంపుటాలు.

అలాగని Stray Birds లో కనవచ్చే కవితలు హైకూలు కావని మనకి అర్థమవుతుంది. అందుకు కారణం టాగోర్ హైకూ ని అనుకరించాలనుకోకపోవడమే. ఆయన అన్వేషిస్తున్నది అభివ్యక్తిమీద అదుపు కోసం. అంతదాకా గీతాలుగా వ్యక్తమవుతున్న తన కవితల రూపసౌష్టవాన్ని కాదని కొత్త రూపాన్ని అన్వేషించడం. అది కూడా వచనకవితారూపంలో.

నిజమే. Stray Birds గీతాంజలిలాగా గొప్ప కవిత్వం కాకపోవచ్చు. అంతగా రసజ్ఞ హృదయాల్ని కదిలించకపోవచ్చు. కాని టాగోర్ కవిత్వం monotonous కాకుండా కాపాడిన ప్రక్రియ అది.

మరో విశేషం కూడా ఉంది. Stray Birds ధోరణి వెనక టాగోర్ చీనా, జపాన్ యాత్ర ఉందని చెప్పాను కదా. వినడానికి ఆశ్చర్యంగా ఉంటుందిగానీ, టాగోర్ Stray Birds ఆధునిక చీనా కవిత్వాన్ని ఒక మలుపు తిప్పిందని చీనా సాహిత్యవిమర్శకులు నేడు చెప్తున్నారు. Stray Birds: Tagore and the genesis of modern chinese poetry అనే వ్యాస్యంలో వోల్ఫ్ గాంగ్ కుబిన్ అనే చీనాసాహిత్యవేత్త ఈ విషయాన్ని ఎంతో విపులంగా చర్చించాడు. ముఖ్యంగా సమకాలిక చీనాకవుల్లో అగ్రగణ్యుడైన బీ–దావో మీద టాగోర్ ప్రభావముందని తెలియడం చాలా ఆశ్చర్యకరంగానూ, నాలాంటి టాగోర్ పిచ్చివాడికి గొప్ప ఊరటగానూ వినిపిస్తుంది.

3

ఇప్పుడు మీ చేతుల్లో ఉన్న 'స్వేచ్ఛావిహంగాలు' తెలుగులో ఇంతదాకా వచ్చిన టాగోర్ అనువాదాల్లో మహనీయమైన వాటి సరసన నిలవగలిగే సామర్థ్యాన్ని సంతరించుకుందని చెప్పగలను.

ఇందుకు, రెండు కారణాలు. ఒకటి నేను ముందే చెప్పినట్టు బొల్లోజు బాబా

కవిత్వోపాసకుడైనందుకు. రెండవది, ఇప్పటి కాలానికీ, ఇప్పటి కవులకీ అవసరమైన ఒక విషయాన్ని గుర్తుచేసినందుకు.

ఇప్పటి కవులకి ధారాళమైన అభివ్యక్తి అయితే ఉందిగాని, ఎక్కడ నోరారా పలకాలో, ఎక్కడ నిగ్రహించుకోవాలో వారికి తెలియడం లేదు. కొన్ని తంత్రుల్ని మీటుతూనే, కొన్ని తంత్రుల్ని అదిమిపట్టినప్పుడే, వీణ సంగీతం పలికిస్తుంది. స్వరతంత్రుల్నీ,హృదయ తంత్రుల్నీ ఎక్కడ అదిమిపట్టుకోవాలో, ఎక్కడ విడిచిపెట్టాలో తెలియడమే కవిత్వకళ. గోదావరీతీరంలో నన్నయనుండి ఇస్మాయిల్ దాకా ఈ పద్యవిద్య గురించే మాట్లాడుతూ వచ్చారు. ఇప్పుడు మరొకసారి టాగోర్ పేరిట బొల్లోజు బాబా మనకి గుర్తు చేస్తున్నదిదే.

అనువాదకుడిగా ఆయన ఇందులో చూపిన ప్రజ్ఞకి ఎన్నో ఉదాహరణ లివ్వవచ్చు. ముఖ్యంగా ఆ క్లుప్తతనూ, గాఢతనూ అంతే పదిలంగా తెలుగులోకి పొదివిపట్టి తెచ్చుకోగలిగాడు.

I cannot choose the best
The best chooses me
శ్రేష్టమైన దాన్ని నేనెన్నుకోలేను
శ్రేష్టమైనదే నన్ను ఎన్నుకుంటుంది.

The World has kissed my soul with its pain
asking for its return in songs.
ప్రపంచం తన వేదనతో
నా హృదయాన్ని ముద్దాడి
బదులుగా గీతాల్ని కోరింది. (167)

The World does not leak because death is not a crack.
మృత్యువు ఒక పగులు కాదు
అందుకే ప్రపంచం కారిపోదు. (222)

Life has become richer by the love that has been lost.
పోగొట్టుకున్న ప్రేమలతో జీవితం
మరింత సుసంపన్నమయింది. (223)

The same lotus of our clime blooms
here in the alien water with the same sweetness,
under another name.

అపరిచిత జలాలలో కూడా
మన ప్రాంతపు కలువ అంతే అందంగా
వికసిస్తోంది, మరో పేరుతో. (232)

ఇట్లా చాలా ఎత్తిచూపవచ్చు.

ఏ భాషలో నైనా అనువాదం అనుసృజన. ఒక భాషలోని పదానికి, చాలాసార్లు మనకి స్ఫురించేపదం సమానార్థకంగా ఉండదు. అంతకన్నా ఒకింత తక్కువగానో, లేదా ఒకింత ఎక్కువగానో ఉంటుంది. చాలా సార్లు ఆ స్ఫురించే మాట మన చేతుల్లో ఉండేదీ కాదు. అదొక సద్యఃస్ఫురణ. అందుకనే తన కవిత అల్లుతూ కవి ఎంత సంభ్రమానికి లోనవుతాడో అనువాదకుడూ అంతే ఆశ్చర్యానికి లోనవుతాడు.

ఈ వాక్యం చూడండి:

రాత్రి చీకటి తిత్తి
సువర్ణోదయంగా పగిలింది. (213)

ఇది చదివినప్పుడు కలిగే స్పందన దీని ఇంగ్లీషు మూలం చదివినప్పుడు కలగదని చెప్పగలను.

Nights darkness is a bag that bursts
with the gold of the dawn.

ఇంత చక్కనికానుక మనకి అందించినందుకు అందరికన్నా ముందు బొల్లోజు బాబానే ఎక్కువ ఆనందించి ఉండవచ్చు. ఆ తర్వాత నేను. ఇప్పుడు మీరంతా కూడా.

హైదరాబాదు **వాడ్రేవు చినవీరభద్రుడు**
3 మే 2016

కృతజ్ఞతలు

ఎంతో ఆప్యాయంగా ముందుమాటలు వ్రాసి, ప్రేమతో ఆశీర్వదించిన శ్రీ వాడ్రేవు చిన వీరభద్రుడు గారికి

వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ నన్ను ముందుకు నడుపుతూన్న నా సాహితీగురువు శ్రీ శిఖామణి గారికి

తెలుగు సాహిత్యమేరువు శ్రీ కె.శివారెడ్డి గారికి

ప్రేరణగా నిలిచి, స్ఫూర్తి నిచ్చే శ్రీ దాట్ల దేవదానం రాజు గారికి

అందమైన ముఖచిత్ర డిజైన్ ఇచ్చిన బాల్య మిత్రుడు ముమ్మిడి చిన్నారికి-

ఇంకా -

శ్రీ అఫ్సర్, శ్రీ ఆకెళ్ల రవిప్రకాష్, శ్రీ పి.ఆర్.ఎల్. స్వామి, శ్రీ యాకూబ్, శ్రీమతి విజయలక్ష్మి, శ్రీమతి వీరలక్ష్మీదేవి, శ్రీ అద్దేపల్లి ప్రభు, శ్రీ అవధానుల మణిబాబు, శ్రీ గనార, శ్రీ చెల్లి రాం, శ్రీ మధునాపంతుల, శ్రీ గణేష్ కుమార్, శ్రీ సంజీవ్, శ్రీ ఫణి, శ్రీ సారథి, శ్రీ ప్రభాకరరావు, శ్రీ అశోక్ కుమార్, అంతర్జాలంలో నా రచనలను చదివి ప్రోత్సహించే మిత్రులందరకూ....

భవదీయుడు

బొల్లోజు బాబా

1
వేసవిలో దారితప్పిన పక్షులు నా కిటికీ పై వాలి
పాటలు పాడి ఎగిరిపోయాయి
పాటలు లేని హేమంత పత్రాలు
తల్లడిల్లి నిట్టూరుస్తో నేల రాలాయి

2
దేశదిమ్మరి పిల్ల మూకల్లారా
మీ పాదముద్రలను నా పదాలపై విడువండి

3
ప్రపంచం తన విశ్వరూప వేషాన్ని
తన ప్రియుని కోసం తీసేసింది. అదిప్పుడు ఒక గీతంలా
అనశ్వర చుంబనంలా భాసిల్లుతోంది

4
వసంతపు దరహాసాలను కావలి కాసేది
మట్టి అశ్రువులే

5
సూర్యుని కోల్పోయినందుకు కన్నీరు రాల్చుకొంటే
నక్షత్రాలను కూడా చేజార్చుకోవలసి వస్తుంది

7
నీ త్రోవలోని మట్టి నీ గానాన్ని నీ గమనాన్ని
నీ అమృత జలాల్నీ యాచిస్తూ ఉంటుంది
వాని మొండి భారాన్ని నీవు మోయగలవా?

8
ఆమె వేదన నిండిన మోము
నా కలలలో సంచరిస్తోంది
రాత్రిని వాన పెనవేసుకొన్నట్లుగా

9
మనం అపరిచితులమని
ఒకప్పుడు స్వప్నించుకొన్నాం
మెలుకువ రాగానే ఒకరినొకరు
ప్రియమైన వారమని కనుగొన్నాం

10
నిశ్శబ్ద తరువుల మధ్య
సాయంత్రం ఎలా జోకొట్టబడుతుందో
అలా నా హృదయంలో
విచారం శాంత పరచబడుతుంది

11
ఏవో అదృశ్య అంగుళులు
సోమరి తెమ్మెరలా నా హృదయంపై
అలల సంగీతాన్ని మీటుతున్నాయి

12
ఓ సంద్రమా! నీ భాషేమిటి?
ఆద్యంతరహితమైన సంశయమే నా భాష
ఓ అంబరమా! నీ సమాధానమేమి?
మరణం లేని నా మౌనమే నా పలుకు

13
హృదయమా ఆలకించు
ఈ ప్రపంచపు గుసగుసలు-
వేటితో అయితే అది నిన్ను ప్రేమిస్తుందో

14
సృష్టి రహస్యం రాత్రిచీకటిలా ఒక అద్భుతం
జ్ఞానంయొక్క మాయలు
ఉదయపు పొగమంచు వంటివి

15
పర్వతశిఖరం ఎత్తుగా ఉంది కదా అని
నీ ప్రేమని దానిపై అధిష్టింపచేయకు

16
నేను నా కిటికీ వద్ద కూర్చుని ఉంటే
ఈ ప్రపంచం ఒక పథికుని వలె ఒక క్షణం నిలచి
తల వూచి సాగిపోయింది

17
ఈ చిరు ఆలోచనలు ఆకుల గలగలలు
నా మదిలో అవి ఆనందపు గుసగుసలు

18
నీవేమిటనేది నువ్వు దర్శించలేవు
నీవు దర్శించేది నీ ఛాయ

19
నా కోర్కెలు మూర్ఖులు
వారు నీపాటల నడుమ అరుస్తూ గోల చేస్తూంటారు
నన్ను నీ గానాన్ని మాత్రమే
ఆలకించేలా చేయి ప్రభూ!

20
శ్రేష్ఠమైన దాన్ని నేనెన్నుకోలేను
శ్రేష్ఠమైనదే నన్ను ఎన్నుకొంటుంది

21
లాంతరును వీపున ధరించేవారు తమనీడలను
తమముందే పడేలా చేసుకొంటారు

22
నేనున్నాను అనుకోవటం
ఒక నిరంతరమైన అద్భుతం
అదే జీవితం

23
గలగలలాడే ఆకులమైన మాకు తుఫాన్లకు
సమాధానమీయగల గొంతుక ఉంది
"ఎవరు నీవు? అలా నిశ్శబ్దంగా ఉన్నావూ?"
"నేను! ఉత్త కుసుమాన్ని"

24
శ్రమకు విశ్రాంతి
కంటికి రెప్పలా ఉంటుంది

25
మానవుడు జన్మత:శిశువు
ఎదుగుదల శక్తే వాని అధికారము

26
ఈశ్వరుడు తాను పంపిన
కుసుమాల కొరకై జవాబులు
ఎదురుచూస్తాడు తప్ప
భూమి సూర్యులకై కాదు

27
పచ్చని ఆకుల మధ్య
దిశమొల శిశువులా ఆడుకొనే కాంతికి
మానవుడు అసత్యమాడగలడన్న
విషయం తెలియదేమో!

28
ఓ సౌందర్యమా!
ప్రేమలోనే నీ ఉనికి
అద్దం పలికే పొగడ్తలలో కాదు

29
నా హృదయం తన అలలతో
ఈ ప్రపంచపు తీరాన్ని స్పృశిస్తూ
తన సంతకాన్ని కన్నీళ్ళతో ఇలా చేసింది
“నేను నిన్ను ప్రేమిస్తున్నాను”

30
చంద్రమా! దేనికై ఎదురుచూస్తున్నావూ?
"సూర్యునికి వందనమిడి ఆయనకు దారివ్వటానికై"

31
ఈ మూగ పుడమి కరుణ స్వరమా అనిపించేలా
చెట్లు నా కిటికీ దాకా ఎదిగాయి

32
ఈశ్వరుని ఉదయాలు ఈశ్వరునికే
నూతన ఆశ్చర్యాలు

33
ప్రాపంచిక హక్కులను బట్టి ఐశ్వర్యము
ప్రేమ యోగ్యతను బట్టి శ్రేష్ఠతా
జీవితానికి సిద్ధిస్తూంటాయి

34
ఎండిన నదీ గర్భం
ఏ కృతజ్ఞతలకు నోచుకోదు
తన గతించిన కాలానికి

35
విహంగం తానొక మేఘాన్నైతే
బాగుణ్ణనుకొంటుంది
మేఘం తానొక విహంగాన్నెందుకు
కాలేదా అనుకొంటుంది

36
జలపాతం పాడుకొంటుంది
“నాకు స్వేచ్ఛ దొరికినపుడే
నా గీతం పల్లవిస్తుంది”

37
నా హృదయమెందుకిలా
నిశ్శబ్దంగా కృశిస్తున్నదో నేను చెప్పలేను
బహుశా తాను ఎన్నడూ అర్థించని
తనకే తెలియని జ్ఞప్తిలేని అవసరాలకోసమేనేమో!

38
ఓ మగువా!
ఇంటిపనుల్లో నీవు తిరుగాడుతోంటే
గులక రాళ్ళ మధ్య సెలయేరులా
నీ పాదాలు గానం చేస్తున్నాయి

39
సూర్యుడు తూరుపుకు తుది వందనమిడి
పశ్చిమ సముద్రాన్ని దాటటానికై సాగాడు

40
నీకు ఆకలి లేని కారణానికి
ఆహారాన్ని నిందించకు

41
మునివేళ్ళపై నుంచొని దేవలోకంలోకి
తొంగిచూసే తరువులు – అవని ఆశలు

42
నీవు నవ్వి నాతో మౌనం గురించి మాట్లాడావు
నేను దీనికోసమే చాలా కాలంగా
ఎదురు చూస్తున్నాననిపించింది

43
నీటిలో చేపలు నిశ్శబ్దంగా ఉన్నాయి
భూమిపై జంతువులు గోల చేస్తూ ఉన్నాయి
గాలిలో పక్షులు పాటలు పాడుకొంటున్నాయి
సముద్రపు మౌనం, అవని ఘోష, గాలి సంగీతం అన్నీ
మనిషిలోనే ఉన్నాయి

44
తామసించే హృదయ తంత్రులపై
ఈ ప్రపంచం నిర్ధయగా పరువులిడి
దిగులు సంగీతాన్ని పలికిస్తుంది

45
అతను తన ఆయుధాలను
తన దేముళ్ళుగా చేసుకొన్నాడు
అతని ఆయుధాల విజయం అతని ఓటమి

46
ఈశ్వరుడు
సృష్టి ద్వారా తనని తాను
తిరిగి పొందుతాడు

47
నీడ తన నమ్రత నిండిన రహస్య ముసుగును ధరించి
నిశ్శబ్దంగా అడుగులో అడుగు వేసుకొంటో
ప్రేమగా వెంబడిస్తోంది, కాంతిని

48
మిణుగురులుగా అగుపించటం పట్ల
తారలు భీతినొందవు

49
నేనో అధికార రథచక్రాన్ని కాక
దాని క్రింద పడి నలిగే జీవరాశిలో
ఒకడినైనందుకు నీకు కృతజ్ఞుడను

50
మనస్సు విశాలంగా కాక నిశితంగా ఉంది
ప్రతీచోటా అతుక్కుంటుంది, ముందుకు కదలక

51
నీ దైవవిగ్రహం దుమ్ము కొట్టుకు పోయింది
ఈశ్వరుని ధూళి నీ దైవవిగ్రహం కన్నా
గొప్పదని నిరూపించింది

52
చరిత్రలో మానవుడెక్కడా
తనని తాను బయలుపరచుకోలేదు
పోరాటాలలో బయటపడ్డాడు

53
తనను సోదరీ అన్నందుకు
మట్టికుండను తిట్టిపోసిన గాజు దీపం
ఉదయచంద్రుని "నా ప్రియాతి ప్రియమైన
సోదరీ" అని సౌమ్యంగా నవ్వుతూ పలకరించింది

54
సముద్రపు కొంగలు, కడలి తరంగాల వలె
మనం కలుసుకొని దగ్గరవుతాం
కొంగలెగిరిపోతాయి
కెరటాలు వెనక్కు మరలుతాయి
మనమూ విడిపోతాం

55
నా రోజు పూర్తయింది
ఒడ్డున చేర్చిన పడవలాగ ఉన్నాను నేను
సాయింకాల ప్రవాహపు నర్తించే సంగీతాన్ని వింటూ

56
జీవితం మనకు ఈయబడింది
దాన్ని వదులుకోవటం ద్వారానే
మరలా సంపాదించగలం

57
గొప్ప వినయాన్ని కలిగి ఉన్నపుడు
శ్రేష్ఠత్వానికి దగ్గరయినట్లే!

58
పింఛపు భారాన్ని మోస్తోన్నందుకు
నెమలిని చూసి పిచ్చుక జాలి పడుతోంది

59
క్షణాల పట్ల భీతి చెందకు’ అంటూ
అనాది స్వరం గానం చేస్తోంది

60
సముద్రపు తుఫాను మార్గం కాని మార్గంలో దగ్గరదాన్ని ఎన్నుకొని
గమ్యం కాని గమ్యంలో తన అన్వేషణను ముగిస్తుంది

61
నా ద్రాక్ష రసాన్ని నా పాత్రలోనే స్వీకరించు మిత్రమా!
ఇతరుల పాత్రలలోకి వంపినట్లయితే అది తన
నురగ దండను కోల్పోతుంది

62
అఖిలము అందంగా అలంకరించుకొంది
అపూర్ణ ప్రేమను పొందటానికై

63
నిన్ను స్వస్థ పరుస్తాను కనుక బాధ పెడుతున్నాను
“ప్రేమిస్తున్నాను కనుక శిక్షిస్తున్నాను” అన్నాడు
నరునితో ఈశ్వరుడు

64
కాంతినిస్తున్నందుకు దీపానికి వందనమిడు
ఛాయలో స్థిరమైన ఓరిమితో నిలుచొని ఉన్న
దీపధారిని మాత్రం మరువబోకు

65
చిన్నారి గడ్డిపోచా!
నీ పాదం చిన్నదే కావొచ్చు కానీ
పుడమి మొత్తం నీ అడుగుల క్రిందే ఉంది

66
శిశు కుసుమం
తన మొగ్గవిచ్చి ఇలా మొరపెట్టింది
"ప్రియలోకమా! దయచేసి వాడిపోకు"

67
ఈశ్వరుడు గొప్ప గొప్ప రాజ్యాల వల్ల
విసుగు నొందునేమో కానీ
చిన్న చిన్న కుసుమాల వల్ల కాదు

68
తప్పు ఓటమిని నిభాయించుకోలేదు
ఒప్పు తట్టుకోగలదు

69
జలపాతం పాడుకొంటోంది
"దాహార్తికి వాటిలో కొంచెమే చాలని తెలిసినా
నా జలాలనన్నీ ఆనందంగా ఇస్తున్నాను" అంటూ

70
ఈ సుమాలను ఎడతెగని
పారవశ్యపు విస్ఫోటనంలోకి
ఎగరేసిన జలసూత్రం ఎక్కడుందీ?

71
చెట్లు నరికే వాని గొడ్డలి
తనకు పిడి కావాలని చెట్టునడిగింది
చెట్టు ఇచ్చింది

72
పొగమంచు వానతో కప్పబడ్డ
ఈ అనాథ సాయంత్రపు నిట్టూర్పుని
నా హృదయ ఏకాంతంలో స్పర్శిస్తున్నాను

73
ముంచెత్తే ప్రేమలో
లభించే ఐశ్వర్యం - సౌశీల్యం

74
పొగమంచు పర్వతాల హృదయంపై ఆడుకొంటో
సౌందర్యాద్భుతాలను వెలికి తీస్తుంది - ప్రేమలానే!

75
మనం ప్రపంచాన్ని తప్పుగా చదువుకొని
అది మనలను వంచిస్తుందని అంటాం

76
తన స్వీయ గళాన్ని వెతుక్కొంటో కవి పవనం
సముద్రాలపైనా వనాలలోనా సంచరిస్తోంది

77
ఈశ్వరుడు మానవునిపై ఇంకా
నిరాశ చెందలేదన్న వార్తను
పుట్టే ప్రతి శిశువూ తీసుకొస్తుంది

78
పచ్చిక తన సమూహాన్ని మట్టిలో వెతుక్కొంటుంది
చెట్టు తన ఏకాంతాన్ని ఆకాశంలో చూసుకొంటూంది

79
మానవుడు తనకు తానే అడ్డు నిలుస్తాడు

80
శ్రద్ధగా ఆలకించే సరుగుడు చెట్ల మధ్య సముద్రఘోషలా
నీ కంఠ ధ్వని నా హృదయంలో సంచరిస్తోంది మిత్రమా!

81
నక్షత్రాల రవ్వలను వెదచిమ్మే
ఈ కనిపించని నిశి జ్వాల ఏమిటి?

82
ఈ జీవితాన్ని అందమైన వేసవి కుసుమాల్లా
మృత్యువుని హేమంత పత్రాల్లాను కరుణించు ప్రభూ!

83
మేలు కోరువాడు తలుపు తడతాడు
ప్రేమించే వానికి తలుపు తెరుచుకొనే ఉంటుంది

84
మృత్యువులో అనేకులు ఒకటవుతారు
జీవితంలో ఒకరే అనేకులు
దేముడు మృతినొందిన నాడే
మతములన్నీ ఏకమౌతాయి

85
కళాకారుడు ప్రకృతి ప్రేమికుడు. అంటే
ఆమెకు బానిస, యజమాని కూడా

86
"ఓ ఫలమా! నీవు నాకెంత దూరంలో ఉన్నావు?"
"ఓ కుసుమమా! నేను నీ హృదయంలోనే దాగొని ఉన్నాను"

87
చీకటిలో తెలుస్తూ పగలు కనపడని
వానికోసమే ఈ నిరీక్షణంతా!

88
"నీవు తామరాకు క్రింద ఉన్న పెద్ద మంచు బిందువువి
నేను పైన ఉన్న చిన్నదాన్ని"
కొలనుతో మంచు బిందువు అంది

89
కత్తి పదునును రక్షిస్తున్నంత సేపూ
ఖడ్గకోశం తాను కాంతి విహీనంగా ఉన్నా
సంతుష్టిగానే ఉంటుంది

90
అజ్ఞానంలో ఒక్కడు ఒకే రూపంలో అగుపిస్తాడు
కాంతిలో ఆ ఒక్కడే పరి పరి విధాలుగా దర్శనమిస్తాడు

91
పచ్చిక సహాయంతో
పుడమి గొప్ప అతిథేయిలా భాసిల్లుతుంది

92
“నువ్వు నా దానవు” అని లోకంతో అన్నది అధికారం
లోకం దానిని తన సింహాసనంపై బందీని చేసింది
“నేను నీ దానను” అని లోకంతో అన్నది ప్రేమ
లోకం దానిని తన ఇంటికి రాజ్ఞి ని చేసింది

94
సడిచేయకుమా మనమా!
ఈ తరువులన్నీ ప్రార్థనలే

95
కాలం చేసే శబ్దాలు
ఆద్యంత రహితుని సంగీతాన్ని
వెక్కిరిస్తున్నాయి.

97
ప్రేమ, మృత్యు, జీవన వాహినులపై తేలుతూ సాగిన
గతించిన కాలాలను స్మరించుకొంటే
నా మహాప్రస్థానపు స్వేచ్ఛ నాకు తెలుస్తోంది

98
నా హృదయ విషాదం
తన పెండ్లికుమార్తె మోముతెర వంటిది
రాత్రి అది తొలగింపబడేందుకై ఎదురుచూస్తోంది.

99
మృత్యువనే ముద్ర జీవితం అనే నాణేనికి
యోగ్యతనిస్తుంది
అపుడు మాత్రమే దానితో
ప్రియమైన వాటిని కొనగలం

100
ఆకాశంలో ఒక మూల
ఆ మేఘం వినమ్రంగా నిలుచుంది
ఉదయసంధ్య
దానికి తేజో కిరీటాన్ని కట్టపెట్టింది

101
మట్టి పరాభవాల్ని పొందుతుంది
బదులుగా తన సుమాలను సమర్పించుకొంటుంది

102
పూలు సేకరించటానికై ఆగిపోకు
నడుస్తూనే ఉండు. అపుడు
వాటంతటవే నీ మార్గం
పొడవునా వికసిస్తూంటాయి

103
వేళ్ళు భూమిలోకి విస్తరించిన కొమ్మలు
కొమ్మలు గాలిలోకి చొచ్చుకొన్న వేళ్ళు

104
సుదూర వేసవి సంగీతం
తన పూర్వ కులాయాన్ని అన్వేషిస్తూ
చలికి గజగజ లాడుతుంది

105
నీ జేబులోని అర్హతలను ఎరువిచ్చి
నీ మిత్రుని అవమానించకు

106
వృద్ధతరువుల చుట్టూ పట్టిన నాచులా
అనామక దినాల స్పర్శ
నా హృదయాన్ని అంటి పెట్టుకొనే ఉంది

107
ప్రతిధ్వని తన మూలాన్ని వెక్కిరిస్తుంది
అదే తన మాతృక అని నిరూపించటానికై

108
ఆయన ప్రత్యేక దీవనలు తమకున్నాయని
శ్రీమంతులు చెప్పుకొంటూంటే
ఈశ్వరుడు తలదించుకొన్నాడు

109
నా దీపం ఇంకా వెలిగింపబడలేదు
నా నీడ నా మార్గం పైనే పడుతోంది

110
తన మౌన కోలాహలాన్ని
నిమజ్జనం చేయటానికై మనిషి రణగొణ ధ్వనుల
సమూహంలో దూరాడు

111
అలసటలో ముగిసేది మృత్యువు మాత్రమే
సంపూర్ణ ముగింపు అనంతంలోనే ఉంది

112
సూర్యుడు ఉత్త వెలుగు దుస్తులనే
ధరించి ఉన్నాడు
మేఘాలు మాత్రం మెరుపుల
పటాటోపం ప్రదర్శిస్తున్నాయి

113
చేయి చాచి తారలను అందుకోయత్నించే
పిల్లల కేకల వలే ఉన్నాయి పర్వతాలు

114
ప్రేమ రాహిత్యపు రహదారి
సమూహంలో కూడా ఒంటరిదే

115
అధికారం తన తుంటరి పనులను శ్లాఘించుకొంటోంది
రాలే పండుటాకులు, కదిలే మేఘాలు నవ్వుకొన్నాయి

116
సూర్యకాంతిలో పుడమి
రాట్నం ఒడుకుతున్న స్త్రీలా
ఏదో ఆదిమ జానపదగీతాన్ని
విస్మృత స్వరంలో గానం చేసుకొంటోంది.

117
తాను పెరిగే మహా ప్రపంచంతో
సమాన విలువను కలిగి ఉంది గడ్డిపరక

118
స్వప్నం మాట్లాడే భార్య
నిద్ర మౌనంగా భరించే భర్త

119
వర్ణం తప్పుతున్న పగలుని ముద్దిడి
చెవిలో రహస్యంగా అంది రాత్రి
"నేను మృత్యువుని, నీ తల్లిని
నీకు నూతనోదయాన్నీయబోతున్నాను"

120
నిశి రాతిరీ!
దీపమార్పిన తరువాత నా ప్రియురాలి స్పర్శలా
నీ సౌందర్యం నాకు తెలుస్తోంది

121
నే మోసుకు తిరిగే నా ప్రపంచం
నా వైఫల్యాల లోకాలన్నింటినీ
క్షేమంగానే చూసుకొంటూంది

122
మిత్రమా!
ఈ సాయంత్రపు వేళ సాగరతీరాన కూర్చొని
అలలను ఆలకించినపుడు నీ ఘనమైన ఆలోచనల
మౌనాన్ని దర్శించగలిగాను

123
చేపను గాల్లోకి ఎగరేసుకుపోవటం
ఒక దయాపూరిత చర్య అని భావిస్తుంది పక్షి

124
చంద్రునితో సూర్యుడు పంపించిన
ప్రేమలేఖలకు తన జవాబును
గరికపై కన్నీళులతో రచించింది – రాత్రి

125
ఉత్తముడు జన్మత:బాలుడే
తన ఘనమైన బాల్యాన్ని
ప్రపంచానికిచ్చేసి వెళ్ళిపోతాడు

126
నీటి నృత్యహేల మాత్రమే
గులక రాళ్ళకు నునుపుదనాన్నిస్తుంది
సమ్మెట దెబ్బలు కావు

127
తేనీగలు మకరందాన్ని గ్రోలి
తమ కృతజ్ఞతను ఝుమ్మనిపిస్తో సాగిపోతాయి
సొగసరి సీతాకోక చిలుకకు తెలుసు
పూవులే తనకు ఋణపడ్డాయన్న విషయం

128
వాచాలునిగా ఉండటం సులభమే
సంపూర్ణ సత్యావిష్కరణకై
కాచుకొని ఉండలేనపుడు

129
“నీ విలాసమెచటా?” అని
సాధ్యం అడిగింది అసంభవాన్ని
“దుర్బలుల స్వప్నాలలో”
జవాబు వచ్చింది

130
అన్ని పొరపాట్లకూ
నీ తలుపులు మూసివేస్తే
సత్యం నిను చేరజాలదు

131
నా హృదయ విషాదం వెనుక
ఏవో గుసగుసలు వినబడుతూన్నాయ్
చూడలేకున్నాను

132
శ్రమే విశ్రాంతికి వ్యాపకం
సాగర నిశ్చలత
కెరటాలై పడిలేస్తూంటుంది

133
ప్రేమలో పత్రం పుష్పమౌతుంది
ఆరాధనలో పుష్పం ఫలమౌతుంది

134
కొమ్మల్ని ఫలింపచేసినందుకు
మట్టిలోని వేళ్ళు పారితోషకాన్ని కోరవు

135
ఈ వర్షించే సాయింకాలపు గాలి అలజడి రేపుతోంది
ఊగే కొమ్మలను చూస్తూ
ఈ అద్భుతాల పట్ల అలా ఆలోచిస్తూ ఉండిపోయినాను

136
వేళకాని చీకట్లలో మేల్కొని
అరుస్తూ క్రీడించే మహా శిశువువలె ఉంది
ఈ నడిరేయి తుఫాను

137
తుఫాను యొక్క ఒకే ఒక
పెండ్లికూతురువైన ఓ సంద్రమా
నీ ప్రియుని వెంబడిస్తూ నీవు లేపే
కెరటాలెంత నిష్ఫలమైనవి

138
"నా శూన్యతకు నాకు సిగ్గేస్తుంది" అంది పదం పని తో
"నిన్ను చూస్తుంటే నేనెంత పేదరాలినో
నాకు తెలుస్తూంది" పని అంది పదంతో

139
కాలం అంటే పరివర్తనమనెడి ఐశ్వర్యం
కానీ గడియారపు ప్రహసనంలో అది
ఉత్తమార్పే తప్ప ఐశ్వర్యం అవటంలేదు

140
వాస్తవాల దుస్తులు సత్యానికి
చాలా బిగుతుగా ఉంటాయి
కల్పన అనే దుస్తులు దానికి ఎంతో హాయి

141
ఓ మార్గమా!
అక్కడికీ ఇక్కడికీ ప్రయాణించేపుడు
నీ పట్ల నాకు విసుగు కలిగేది
ఇప్పుడు నువ్వు నన్ను అన్ని చోట్లకూ
తీసుకువెళుతున్నావు కదా
నీ ప్రేమలో బంధింపబడ్డాను

142
నా జీవితపు తెలియని చీకట్లలో
ఆ అనంత నక్షత్రాలలో ఒకటి
నన్ను నడిపిస్తుందని భావించనీ ప్రభూ!

143
మగువా!
నా ప్రపంచాన్ని నీ సొగసరి
అంగుళులతో స్పృశించావు అంతే
ప్రశాంతత సంగీతమై పల్లవించింది

144
కాల శిధిలాల మధ్య ఒక విషాద స్వరం
గూడుకట్టుకొని ఉంది
నేను నిన్ను ప్రేమిస్తున్నానంటూ- అది
రాత్రివేళల పాడుతూంటుంది

145
జ్వలించే అగ్ని తన తేజస్సుతో నన్ను హెచ్చరించి
నివురు మూసిన నిప్పునుండి నన్ను రక్షిస్తుంది

146
ఆకాశం నిండా నా నక్షత్రాలే
పాపం నా ఇంటిలోని చిరుదీపం
వెలిగింపబడనే లేదు

147
మృతపదాల ధూళి నీ దేహంపై పరుచుకుంది
నీ ఆత్మను మౌనంతో కడిగివేయి

148
జీవితపు ఖాళీలలోంచి విషాద
మృత్యు సంగీతం వినిపిస్తూంది

149
ఈ ఉదయాన
లోకం తన కాంతి హృదయాన్ని తెరచింది
ఓ! నా మనసా ప్రేమ నింపుకొని రా
దానిని ఆహ్వానించేందుకు

150
ఆకులతో కూడి
నా ఆలోచనలు గలగల లాడుతున్నాయి
సూర్యకాంతి స్పర్శకు నా హృదయం గానం చేస్తోంది
కాల చీకట్లలోకి, వినీల విశ్వంలోకీ
ఈ అనుభవాలతో తేలుతూ
సాగుతున్నందుకు నా జీవితం సంతసిస్తూంది

151
మహాబలుని శక్తి
పిల్ల తెమ్మెరలో ఉంది
తుఫానులో కాదు

152
ఒక స్వప్నంలో ఈ ప్రపంచమంతా
చెల్లాచెదరై బాధ పెడుతూ ఉండింది
మెలకువ వచ్చేసరికి అవన్నీ నీలో చేరాయి
నాకెంతో తేలికగా ఉంది ప్రభూ!

153
“నా బాధ్యతను ఎవరు తీసుకొంటారు?”
అడిగింది అస్తమిస్తున్న రవి బింబం
“నాకు చేతనైన సాయం చేస్తాను ప్రభూ”
అంది మట్టి దీపం

154
తుంచిన రేకలతో
పుష్ప సౌందర్యాన్ని
పునర్నిర్మింపలేవు మిత్రమా!

155
నిదురించే పక్షుల్ని ఇముడ్చుకొనే కులాయంలా
నీ స్వరాన్ని నిశ్శబ్దం మోస్తూంటుంది

156
ఉత్తములు నిర్భయంగా
అర్భకులతో కలసి నడుస్తారు
మధ్యస్థులే దూరంగా ఉంచుతారు

157
రహస్యంగా పూలను పుష్పించే రాత్రి
మెచ్చుకోళ్ళను పగలుకు వదిలేస్తుంది

158
తన కోరల చిక్కిన వారు
అటునిటూ గింజుకోవటాన్ని
కృతఘ్నతగా భావిస్తుంది–అధికారం

159
మన పూర్ణత్వానికి సంతోషించినపుడే
మన ఫలాల వియోగాన్ని స్వాగతించగలం

160
వాన చినుకులు భూమిని ముద్దాడి
రహస్యంగా ఇలా అన్నాయి
“మేము ఇంటిబెంగ పెట్టుకొన్న నీ పిల్లలం తల్లీ
స్వర్గం నుండి నీకొరకై తిరిగొచ్చేసాం”

161
మంచుబిందువుల్ని పట్టుకొంటున్నట్లు నటిస్తూ
ఈగల్ని చిక్కించుకుంటూంది సాలెగూడు

162
ప్రేమా!
నీవు వేదనా దీపాన్ని చేబూని
వచ్చినపుడు నీ మోము చూసి నీవే
బ్రహ్మానందమని పోల్చుకొన్నాను

163
"నీ కాంతులు ఒకనాటికి అంతమౌనని
విజ్ఞులు అనెదరు" మిణుగురు అంది నక్షత్రాలతో
నక్షత్రాలు ప్రత్యుత్తరమీయలేదు

164
సాయం సంధ్య వేళలో
ఉదయరాగపు విహంగం
నా నిశ్శబ్దపు గూటికి చేరుతుంది

165
నా మదిలోని ఆలోచనలు
ఆకాశంలోపక్షుల గుంపులా కదుల్తూన్నాయి
వాని రెక్కల చప్పుడు నాకు వినిపిస్తోంది

166
తనకు నీరందించటానికి మాత్రమే
నది ఉందని అనుకోవటం
కాలువకు ఎంత ఇష్టమో

167
ప్రపంచం తన వేదనతో
నా హృదయాన్ని ముద్దాడి
బదులుగా గీతాల్ని కోరింది

168
ఏది నన్ను వేదనకు గురిచేస్తున్నది
బయటకు రావాలని ప్రయత్నిస్తున్న జీవాత్మా లేక
లోనికి రావటానికై మది తడుతున్న లోకాత్మ యా?

169
ఆలోచన తన పదాల్ని తానే
నెమరువేసుకుంటూ ఎదుగును

170
ఈ నిశ్శబ్ద ఘడియలో
నా హృదయ ఖాళీ పాత్రను ముంచాను
నీ ప్రేమతో అది నిండింది ప్రభూ!

171
పని ఉండనీ ఉండక పోనీ
"ఏదో ఒకటి చేద్దాం" అనవలసివస్తే
వెంటనే తుంటరితనం చిగురిస్తుంది

172
తన అనామక పుష్పాన్ని నాదని చెప్పుకోవటానికి
పొద్దుతిరుగుడు మొక్క సిగ్గుపడింది

ఉదయించిన రవి ఆ చిరుసుమాన్ని చూసి నవ్వి
“సౌఖ్యమా! నా ప్రియతమా” అన్నాడు

173
విధిలా ముందుకు తోస్తున్నదెవరు?
నా వీపున స్వారీ చేస్తున్న నేనే

174
దూరపు కొండల మాటున
దాగున్న మేఘాలు
నదుల నీటి పాత్రికలను నింపుతో ఉన్నాయి

175
నడుస్తూన్నపుడు నా బిందెలోని నీళ్ళు
కొద్దికొద్దిగా చిందిపోయాయి
ఇంటికి చేరేసరికి కొంచెమే మిగిలినయ్

176
బిందెలోని జలం తళుక్కుమంటూంది
సముద్రపు నీరు గంభీరంగా ఉంది
సిద్ధాంతాలు తేటపదాలలో ఉంటాయి
పరమ సత్యం గొప్ప నిశ్శబ్దాన్ని ధరిస్తుంది

177
నీ దరహాసం నీ పొలాలలోని సుమాలు
నీ మాటలు నీ పర్వతాల సరుగుడు చెట్ల గుసగుసలు
నీ హృదయం మాత్రం
మేమందరమూ ఎరిగిన లలన

178
అల్ప వస్తువులను నా ఆత్మీయులకై
విడిచిపెడతాను
శ్రేష్ఠమైనవి అందరి కోసమూ

179
మగువా
నీవు ఈ ప్రపంచపు హృదయాన్ని
నీ అశ్రువుల లోతులతో చుట్టుముట్టావు
భూమిని ఆవరించిన సాగరంలా

180
నవ్వుతో నను పలకరిస్తున్నది సూర్యకాంతి
దాని పాపిష్టి సోదరియైన వాన
నా మదితో ఊసులాడుతోంది

181
ఉదయ సుమం రేకలు రాల్చుకొంది
సాయింత్రానికల్లా అది
స్వర్ణ స్మృతి ఫలమైంది

182
తన పాద ముద్రల జ్ఞాపకాలను
నిశ్శబ్దంగా ఆలకించే
రాత్రిపూట రహదారిని నేను

183
సాయింకాలపు ఆకాశమంటే నాకు
ఒక గవాక్షం
ఒక వెలిగించిన దీపం
ఒక నిరీక్షణ

184
మంచి చేయటంలో తలమునకలైన వానికి
మంచిగా ఉండే తీరికుండదు

185
వానలు నిండుకొన్న
శరత్కాల మేఘాన్ని నేను
నా నిండుతనమంతా
పండిన వరిచేలల్లో ఉంది

186
వాళ్ళు అసహ్యించుకొన్నారు, చంపేసారు
ప్రజలు వారిని పొగిడారు
దేముడు సిగ్గుపడి
ఆ జ్ఞాపకాలను హడావిడిగా
పచ్చగడ్డి క్రింద కప్పెట్టేసాడు

187
బండగా కనిపించే కాలివేళ్ళు
ఒకప్పటి కోమలమైన చేతివేళ్ళే

188
చీకటి వెలుగు వైపుకు
ప్రయాణిస్తుంది కానీ
అంధత్వం మరణం వైపుకు

189
ఈ ప్రపంచం కుక్రపన్ని తన స్థానాన్ని
కైవసం చేసుకోగలదని
పెంపుడు కుక్కకు అనుమానం

190
ఓ నా హృదయమా!
నిశ్చలంగా ఉండు ధూళి రేపకు
ఈ ప్రపంచం నిన్ను చేరే మార్గాన్ని గుర్తించనీ

191
వేగం పుంజుకుంటున్న బాణంతో
"నీ స్వేచ్ఛ నాదేనంది" ధనుస్సు

192
మగువా! నీ నవ్వులో
జీవన జలసూత్రపు సంగీతముంది

193
తర్కంతో కూడిన మనసంటే
అన్నివైపులా పదునున్న కత్తివంటిది
దాన్నుపయోగించే చేయి
నిత్యం రక్తమోడుతూంటుంది

194
తన గొప్ప నక్షత్రాలకంటే
మానవుని చిరుదీపం మెరుగ్గా
వెలగడం ఈశ్వరునికి ఎంతో ఇష్టం

195
సౌందర్య సంగీతంచే మచ్చికచేయబడ్డ
మహోగ్ర అరణ్య తుఫాన్ల లోకమే ఈ ప్రపంచం

196
"నా హృదయం నీ చుంబనపు స్వర్ణ భరిణె"
రవితో అంది సాయంసంధ్యా మేఘం

197
బంధించాలనుకుంటే సౌందర్యం వాడిపోవచ్చు
స్వేచ్ఛనిచ్చిన నాడు అది నిన్ను వరించవచ్చు

198
చీకట్లో వినిపించే చిమ్మెట రొద
వానచినుకుల చిటపటలు
నా గతించిన యౌవన స్వప్నాల గలగలలు

199
అన్ని నక్షత్రాల్నీ కోల్పోయిన ఉదయపు ఆకాశంతో
"నా మంచు బిందువు పడిపోయిందని" ఓ సుమం
ఏడుస్తూ చెప్పుకొంటూంది

200
"ఇది నా పూవు, నా చావు" అంటూ ఏడుస్తున్నది
జ్వాలలో పగిలి కాల్తున్న కట్టె

201
కందిరీగ తన తేనెటీగ మిత్రుల గూడు
ఇరుకైనదని భావిస్తుంటే
దాని తేనెటీగ మిత్రులు చిన్న ఇల్లు
కట్టుకొమ్మని సలహా ఇస్తున్నారు

202
"నీ అలలను నేను నిలువరించలేను" ఒడ్డు అంది నదితో
"నీ పాద ముద్రలను నా హృదిలో నిలుపుకోనీ"

203
చిన్నారి పుడమి ఘోషలో
దినం సమస్తలోకాల మౌనాన్ని మింగేసింది

204
గాలిలోని అనంతాన్ని, నేలపైని సౌందర్యాన్ని
రెంటిలోని కవిత్వాన్ని గీతం పలికిస్తున్నది.
దాని పదాలు
నడయాడే అర్థాలు, తేలియాడే సంగీతమూ.

205
సూర్యుడు పశ్చిమాన కృంగిపోయే వేళ
తన ఉదయపు తూరుపు
మౌనంతో ఎదురుగా నిలుచుంటుంది

206
నా లోకానికి నన్ను నేను తప్పుగా చూపించుకొని
దాన్ని నా విరోధిగా చేసుకోకుండా చూడు ప్రభూ!

207
పొగడ్త నన్ను సిగ్గుపరుస్తుంది
కానీ నేను దాన్ని రహస్యంగా యాచిస్తూంటాను

208
ఏ వ్యాపకమూ లేనప్పటి నా నిర్వ్యాపకం
తన ప్రశాంత లోతులలో కలత చెందకుండు గాక!
మౌన జలాల సముద్ర తీర సాయింత్రంలా

209
కన్యామణీ!
నీ ముగ్ధత్వం తటాకపు నీలిమ వలె
అగాథతత్వాన్ని ఆవిష్కరిస్తోంది

210
శ్రేష్ఠత్వం ఒంటరిగా రాదు
సపరివార సమేతంగా విచ్చేస్తుంది

211
ఈశ్వరుని కుడిచేయి బహు మృధువైనది
కానీ ఎడమచేయి బహు క్రూరమైనది

212
నా ఉదయ తారలకు అర్థంకాని భాషలో మాట్లాడుతో
అపరిచిత తరువుల లోకి నా సాయింత్రం అరుదెంచింది

213
రాత్రి చీకటి తిత్తి
సువర్ణోదయంగా పగిలింది

214
అల్ప విషయాలైన పొగమంచు, ఆవిర్లకు
ఆశ ఇంద్రధనుసు రంగులద్దుతుంది

215
తన సుమాలనే తిరిగి
మానవుని కాన్కలుగా పొందటానికై
ఈశ్వరుడు కాచుకొని ఉన్నాడు

216
నా శోకపుటాలోచనలు
తమ పేర్లేమిటని అడుగుతో
నన్ను వేధిస్తున్నాయి

217
ఫలాల సేవలు విలువైనవి, పుష్పాల సేవలు ఇంపైనవి.
కానీ నా సేవను
వినమ్ర భక్తి నీడలో కొలువుండే
ఆకుల చాకిరీ వలె ఉంచు ప్రభూ!

218
సోమరి గాలులలో తన తెరచాపను
విప్పుకుంది నా హృదయం
సాంత్వనిచ్చే ఏదో దీవికై

219
జనులు క్రూరులు కానీ
మానవుడు దయాళువు

220
నన్ను నీ పాత్రికను చేసుకొని
నా నిండుతనాన్ని స్వీకరించు ప్రభూ!

221
మర్త్యలోకం తన ప్రేమను తిరస్కరించినందుకు
ఎవరో అమర్త్యుడు చేసే రోదనే ఈ తుఫాను

222
మృత్యువు ఒక పగులు కాదు
అందుకే ప్రపంచం కారిపోదు

223
పోగొట్టుకొన్న ప్రేమలతో జీవితం
మరింత సుసంపన్నమయింది

224
మిత్రమా! నీ హృదయం
సూర్యోదయంతో కలిసి వెలుగుతోంది
సూర్యాస్తమయపు ఏకాకి హిమగిరిలా

225
మృత్యు జలసూత్రం జీవితపు
నిశ్చల జలాలను ఆటాడిస్తూంటుంది

226
నీవు తప్ప మరేమీ లేని వారు
వారు తప్ప మరేమీ లేని వారిని చూసి
నవ్వుకొంటున్నారు ప్రభూ!

227
స్వీయ సంగీతం లోనే
జీవనోద్యమానికి విశ్రాంతి

228
పదఘట్టనలు భూధూళిని
మాత్రమే రేపగలవు
పంటలను కాదు

229
రాత్రివేళ సాగర కెరటాలపై
సంతకం చేయకుండానే అంతరించే
కాంతి తళుకుల వంటివి మన పేర్లు

230
గులాబీని చూసే కళ్ళున్న వాడిని
ముళ్ళనీ చూడనివ్వండి

231
పక్షి రెక్కలను స్వర్ణంతో అలంకరించి చూడండి
ఇక అది ఎప్పటికీ ఆకాశాన ఎగరదు

232
అపరిచిత జలాలలో కూడా
మన ప్రాంతపు కలువ అంతే అందంగా
వికసిస్తోంది, మరో పేరుతో

233
హృదయం దృష్టిలో దూరమంటే
దిగంతాలు కలుసుకొనే చోటే

234
చందమామ కాంతి ఆకాశమంతటికీ
మచ్చలు మాత్రం తనకు మాత్రమే

235
దీన్ని ఉదయమనకు లేదా
నిన్నటి పేరేదో పెట్టి తిరస్కరించకు
మొదటిసారిగా చూసే అనామక
నూత్న శిశువులా దీన్ని స్వీకరించు

236
జ్వాలకు సహోదరులైన
పొగ పటాటోపంతో నింగికీ
బూడిద నేలనూ చేరాయి

237
"నీ హృదయంలో ఎప్పటికీ నన్నుంచుకోవూ?"
అడిగింది వానచినుకు మల్లియను రహస్యంగా
"అయ్యో రాత" అని నిట్టూర్చి మల్లియ నేలరాలింది

238
పిరికి ఆలోచనల్లారా
నన్ను చూసి భయపడకండి
నేనో కవిని

239
కీచురాళ్ళ శబ్దాలతో నా హృదయపు
పలచని నిశ్శబ్దం నిండిపోయింది
మసక వెన్నెల మేళం

240
తారాచువ్వలు నింగికి లేస్తూ
నక్షత్రాలను చేసిన పరిహాసం
వాటివెనుకనే నేలను చేరింది

241
నా కిక్కిరిసిన దైనందిక యాత్రల నుండి నన్ను
సాయింకాలపు ఏకాంతంలోకి నడిపించావు

దాని అర్థం కోసమై రాత్రంతా నిశ్చలంగా
అలా ఎదురుచూస్తూనే ఉన్నాను, ప్రభూ!

242
ఈ జీవితం ఓ సముద్ర యానం
మనం ఒకే ఇరుకు ఓడలో కలుసుకుంటాం
మృత్యువనే తీరాన్ని చేరి
మన మన భిన్నలోకాలలోకి వెళిపోతాం

243
భ్రమలనే తన నదులలో
సత్య ప్రవాహం పారుతూంటుంది

244
కాల సంద్రంలో ఒకానొక మధురఘడియకై
నా హృదయం బెంగ పెట్టుకొంది

245
పుడమి ప్రతిధ్వనించే
ఉదయకాంతే పక్షిపాట

246
"నన్ను ముద్దిడేంత స్వాతిశయమా నీకు"
ఉదయకిరణాలు అడిగాయి వెన్నముద్దను

247
"నిన్నే గానం చేస్తూ పూజించటమెలా?"
సూర్యుని అడిగింది ఓ చిన్ని పూవు

“స్వచ్ఛమైన నీ నిశ్శబ్దం ద్వారా”
బదులిచ్చాడు సూర్యుడు

248
మనిషి ఒక జంతువు అనుకొంటే
మృగం కన్నా హీనుడు అతను

249
కరిమబ్బుల్ని కాంతి ముద్దిడగా
అవి దేవలోక సుమాలైనాయి

250
పిడి మొద్దుగా ఉందని కత్తి అంచు
పరిహాసమాడకుండు గాక

251
రాత్రిమౌనం ఒక సుదూర దీపంలా
తన పాలపుంత కాంతితో వెలుగుతోంది

252
జీవితమనే సుందర ద్వీపం చుట్టూ
రేయింబవళ్ళ అనంత మృత్యుగీతం
సాగరమై ఉబుకుతోంది

253
ఈ పర్వత శ్రేణి ఓ పుష్పంలా లేదూ?
తన రేకల గిరులతో సూర్యకాంతిని పీల్చుకొంటో!

254
అవాస్తవం అంటే
తప్పుడు భాష్యం చెప్పబడ్డ వాస్తవం
తప్పుడు చోట చేయబడ్డ వక్కాణింపు

255
హృదయమా! నీ సౌందర్యాన్ని
ప్రాపంచిక చలనాలలో దర్శించు
జలాలనూ గాలినీ ప్రతిబింబించే పడవలా

256
కళ్ళు తమ అద్దాలకు గర్విస్తున్నాయట
తమ దృష్టికి కాక

257
నేను నాదైన ఈ చిన్ని ప్రపంచంలో నివసిస్తూ
దాన్ని త్యజించటానికై సంకోచిస్తూ ఉంటాను ప్రభూ!
నన్ను నీ లోకంలోకి తోడ్కొని నా సర్వస్వాన్ని
సంతోషంగా కోల్పోయే స్వేచ్ఛనీయవా, దేవా!

258
అధికారంలో పెరిగినంత మాత్రాన
అబద్ధం ఏనాటికీ సత్యంగా ఎదగలేదు

259
శుభదినపు హరిత ప్రపంచాన్ని
తన గాన కెరటాలతో తాకేందుకు
నా హృదయం ఉవ్విళ్ళూరుతోంది

260
ఒడ్డున పెరిగే గడ్డిపోచా నక్షత్రాలను ప్రేమించు
నీ స్వప్నాలు సుమాలుగా వికసిస్తాయి

261
ప్రభూ!
నీ సంగీతం ఒక కరవాలం వలె ఈ బజార్ల
రణగొణ ధ్వనులను సమూలంగా చీల్చేయనీ

262
ఈ గలగలలాడే ఆకులు నా హృదయాన్ని
చిన్నారి శిశువు చేతి వేళ్ళలా స్పృశిస్తున్నాయి

263
నా హృదయ విషాదం
తన పెండ్లికుమార్తె మోముతెర వంటిది
రాత్రి అది తొలగింపబడేందుకై ఎదురుచూస్తోంది.
(ఇది 98 పద్యమే)

264
చిరు కుసుమం దుమ్ములో పడి ఉంది
అది సీతాకోక చిలుక మార్గాన్ని
వెంబడించింది

265
దారుల ప్రపంచంలో నేనున్నాను. రాత్రి వచ్చి
నీ ఇల్లనే ప్రపంచపు తలుపు తెరుస్తుంది, ప్రభూ!

266
నీ సమక్షంలో పాటలు పాడాను
ఆ సాయంత్రపు గాలివాన దారిలో
నీ దీపాన్ని మోసుకుంటో సాగిపోనీ, ప్రభూ!

267
నా ప్రియతమా!
నిన్ను నా ఇంటిలో ఉండమనలేదు.
నా అనంత ఏకాంతంలోకి రమ్మంటున్నాను

268
చావు జీవితానికి చెంది ఉంది పుట్టుకలానే.
నడకలో అడుగు ఎత్తటమే కాదు దించటం కూడా ఉన్నట్లు.

269
పూవులు, సూర్యకాంతుల ద్వారా
నీ గుసగుసల సారాంశం లీలగా తెలుసుకొన్నాను.
మృత్యువు, బాధలతో నీ సంభాషణల జ్ఞానాన్ని
బోధించవా ప్రభూ!

270
ఉదయచుంబనానికి రాత్రి పూవు ఆలస్యమైంది
వణుకుతూ నిట్టూరుస్తూ నేలరాలింది

271
సమస్త శోకాలలోనూ నాకు
జగన్మాత జోలపాట వినిపించును

272
నా మట్టి నేస్తమా!
నీ తీరానికి నేనో అపరిచితుడనై వచ్చాను
నీ గృహంలో ఓ అతిథివలె వశించాను
ఓ మిత్రునివలె సెలవు తీసుకొంటున్నాను

273
తారల నిశ్శబ్దపుటంచున మెరిసే
సూర్యస్తమయానంతర తళుకులా
నా నిష్క్రమణానంతరం నా ఆలోచనలు
నిను చుట్టుముడతాయి

274
సాయింకాల విశ్రాంతి నా హృదయంలో కాంతులీనుతోంది
ఎన్నో ప్రేమరహస్యాలను ఆ రాత్రి నా చెవిలో తెలిపింది

275
చీకటిలో ఉన్న శిశువును నేను
రాత్రి దుప్పటిలో చేతులు చాచి
నీకై తడుముకొంటున్నాను తల్లీ!

276
నా దినచర్య పూర్తయింది
నా మోము నీ ఒడిలో దాచుకొని
స్వప్నించనీ తల్లీ!

277
కలయిక దీపం
వెలుగుతూనే ఉంటుంది
విడిపోయే సమయానికి
అది కొండెక్కుతుంది

278
ఓ ప్రపంచమా!
"ప్రేమికుడు" అన్న ఒక్క పదాన్ని
నా పార్థివ దేహమౌనంపై ఉంచవా!

279
ఈ లోకాన్ని ప్రేమించినపుడే
దానిలో జీవించగలం

280
మృతులకు అమరకీర్తిని
మనుజులకు అమృత ప్రేమను
కరుణించు ప్రభూ!

281
ఉదయాంతాన తల్లిని చూసి నవ్వి
నిదుర మత్తు ఇంకా వదలక
మరలి పరుండిన శిశువులా
నిను నే దర్శించాను ప్రభూ!

282
జీవితం తరగనిది అని తెలుసుకోవటానికై
నేను మరల మరల మరణిస్తాను

283
ప్రభూ! నేను జనసందోహం మధ్య నడుస్తున్నపుడు
మేడ మీంచి వినిపిస్తున్న నీ దరహాసాన్ని చూసాను
రణగొణ ధ్వనుల్ని మరచి నీ గానం చేసాను

284
ద్రాక్షరసంతో నింపబడిన పాత్రికలా
పూర్ణత్వం పొందిన ప్రేమే జీవితం

285
వాళ్ళు వారి వారి దీపాలను వెలిగించుకొని
తామే వ్రాసుకొన్న గీతాలను
తమ ఆలయాల్లో గానం చేస్తున్నారు.
కానీ పక్షులు
నీవు కరుణించిన ఉదయకాంతిలో
నీ నామాన్నే గానం చేస్తున్నాయి
ఎందుకంటే నీ నామమే బ్రహ్మానందము

286
నీ నిశ్శబ్దములోకి నన్ను నడిపించి
గీతాలతో నా హృదయాన్ని నింపేయి, ప్రభూ!

287
మతాబు వెలుగుల లోకాన్ని
కోరుకొనే వారిని అలానే జీవించనీ
నా హృదయం మాత్రం
నీ నక్షత్రాలకై నిరీక్షిస్తున్నది ప్రభూ!

288
నా జీవితాన్ని ప్రేమవేదన పెనవేసుకొని
లోతు తెలియని సంద్రంలా గానం చేసింది
పూవనంలో కోయిలలవలె ప్రేమానందం
తన పాటలను పాడి వినిపించింది

289
నీ ఇచ్ఛ అదే అయితే దీపాన్ని నిలిపివేయి ప్రభూ
నేను నీ అంధకారాన్ని తెలుసుకొని ప్రేమించాలి కదా!

290
దినాంతాన నేను నీముందు నిలుచున్నపుడు
నీవు నా గాయాల మచ్చలను చూస్తావు
నేను గాయపడ్డానని, స్వస్థత పొందానని గ్రహిస్తావు

291
ఏదో ఒకనాడు మరో ప్రపంచపు సూర్యోదయాన
నీ ముందు మోకరిల్లి నేను నీ పాటలను ఆలపిస్తాను
'నిను అప్పటికే నేను చూసి ఉంటాను ప్రభో!
మట్టి కాంతిలోనో, మానవ ప్రేమలోనో'

292
ఆనాటి మేఘాలు
వర్షించటానికో లేక తుఫాను సృష్టించటానికో కాక
నా సాయింసంధ్యాకాశాన్ని వర్ణమయం చేసేందుకు
అలా తేలుతూ వస్తున్నాయి

293
సత్యబీజాల వ్యాప్తిని విఛ్ఛిన్నం చేసే గాలివానను
సత్యమే స్వశక్తితో ఎదిరిస్తోంది

294
రాత్రి వచ్చిన గాలివాన ఈ ఉదయాన్ని
స్వర్ణ శాంతి కిరీటంతో అలంకరించింది

295
సత్యం చివరిమాటను వెంటేసుకొచ్చినట్లు అగుపిస్తుంది
కానీ, తుదిపలుకు మలిపలుకుకు జన్మనిస్తుంది

296
కీర్తి క్షయింపలేని సత్యధారి
ఎంతటి ధన్యజీవి

297
ప్రభూ నన్ను నీకు అర్పించుకొన్న నాడు
నీ నామ మాధుర్యంతో నా హృదయం నిండిపోయింది
పొగమంచు కరిగినపుడు బయటపడ్డ భానూదయంలా!

298
ఈ మౌన రాత్రిలో
అమ్మ అనురాగము, పిల్లవాని అల్లరి పగలు
దాగిఉన్నాయి

299
మానవుడు నవ్వినపుడు ఈ లోకం హర్షించింది
పరిహసించినపుడు అది భీతినొందింది

300
మానవుడు జ్ఞానంతో తన బాల్యాన్ని
తిరిగిపొందేదాకా ఈశ్వరుడు ఎదురుచూస్తాడు

301
ప్రభూ!
ఈ లోకం నీ ప్రేమ రూపమని గ్రహించనీ
అపుడు
నా ప్రేమ కూడా పాలుపంచుకొంటుంది

302
నా హృదయపు శిశిర దినాలపై
నీ సూర్యోదయం నవ్వులు చిందిస్తోంది
నా వసంతాగమనం పట్ల రవంత అనుమానం లేకుండా!

303
ఈశ్వరుడు
తన ప్రేమలో అశాశ్వతాన్ని ముద్దు చేస్తూంటాడు
మానవుడు అనంతం కొరకై వెతుకుతూంటాడు

304
నిష్ఫల వత్సరాల ఎడారి ఇసుకలలో
మోక్ష తరుణం కోసమై నీవు సాగిపోతావు

305
ఈశ్వరుని మౌనం మానవ ఆలోచనలను
మాటలుగా ఫలింపచేస్తుంది

306
నిత్య పథికుడా! నా పాటల దారిలో
నీ పాదముద్రలను పోల్చుకొంటావు

307
నీ ఘనతను నీ పిల్లలమైన మాలో పొందుపరచిన
నిన్ను సిగ్గుపడేటట్లు మమ్మ చేయనీయకు ప్రభూ!

308
దినం సంతోషరహితంగా ఉంది
కారుమబ్బుల క్రింది కాంతిపుంజం
తన పాలిన బుగ్గలపై కన్నీళ్ళులతో
శిక్షింపబడిన బాలుని వలె ఉంది
గాయపడ్డ ప్రపంచ రోదనను గాలి వినిపిస్తోంది
కానీ నాకు తెలుసు నేను నా మిత్రుని
కలుసుకోవటానికై వెళుతున్నానని

309
ఈ రాత్రి కొబ్బరాకులు గలగల మంటున్నాయి
సాగరం ఎగసి పడుతోంది
చందమామ ఈ ప్రపంచపు హృదయ రాజ్ఞియైంది
ఏ తెలియని దిగంతాలమౌనంలోంచి ఈ బాధించే
ప్రేమ రహస్యాన్ని నీవు తీసుకొచ్చావూ!

310
నేను స్వప్నిస్తున్నాను ఒక నక్షత్రాన్ని ఒక వెలుతురు ద్వీపాన్ని
నేనచటే పుడతానట నా జీవితకాల తపస్సు అచటే ఫలించునట
హేమంత సూర్యకాంతిలో పండిన వరిచేనులా!

311
నిరర్ధక మూగ సమూహాలు నీ ఘనతను
శ్లాఘిస్తూ జపించిన మధుర కీర్తనలా అన్నట్లు
వానకితడిచిన మట్టి వాసన లేచింది ప్రభూ!

312
ప్రేమ ఎప్పుడైనా ఓడిపోవచ్చునన్న నిజం
మనమెప్పటికీ ఆమోదించలేని ఒక సత్యం

313
మన జీవాత్మ ఆర్జించిన సంపదను
మృత్యువు దోచుకుపోలేదనీ
ఆత్మైశ్వర్యం ఆత్మలోనే ఉన్నదనీ
ఒకనాటికి తెలుసుకొంటాము

314
వసివాడని నా గతకాల పూలను సజ్జలో వేసుకొని
ఈశ్వరుడు నా సాయంసంధ్యలోకి ప్రవేశించేను

315
నా జీవన తంత్రులన్నీ శ్రుతిచేయబడినపుడు
నీ ప్రతీ స్పర్శకూ ప్రేమ సంగీతం పెల్లుబుకుతుంది ప్రభూ!

316
సత్యనిరతుడనై ఉండేట్లు కరుణించు ప్రభూ!
అపుడు చావు అనే సత్యం నాకు భోధపడుతుంది

317
అవమానింపబడిన మనిషి విజయం కోసం
మానవ చరిత్ర ఓపికగా నిరీక్షిస్తోంది

318
పంటకోసిన ఒంటరి పొలాలపై పడే
ఉదయపు మౌన రవికిరణాలలా
నా హృదయంపై ఈ క్షణం నీ తీక్షణ దృక్కులు
ప్రసరిస్తున్నాయి ప్రభూ!

319
ఎగసిపడే ఈ వెర్రి కేకల సంద్రంలో
సరాగాల ద్వీపం కొరకై నే నిరీక్షిస్తున్నాను

320
అనిర్వచనీయమైన చీకటిపై సూర్యాస్తమయం
గానం చేసిన గంభీర కీర్తన తోనే
రాత్రి ఆలాపన మొదలైంది

321
నేను కీర్తి శిఖరాన్నధిరోహించాను
ఆ శిఖరాగ్రంపై, ఆ చలిగాలులలో మరుగులేదు
నన్ను నడిపించు మార్గదర్శీ!
ఎక్కడైతే జీవితపు ఫలాలు
ఆత్మ జ్ఞానంగా పరిపక్వమౌతాయో
అట్టి ప్రశాంత లోయల్లోకి
చీకటిపడే లోపు నన్ను తీసుకువెళ్ళు

322
సాయింకాల మసక వెలుతురులో
ఈ ప్రపంచం వింతైన సొబగులద్దుకొంది
తరువుల మూలాలు చీకట్లో కలసిపోయాయి
వృక్షాగ్రాలు సిరా మరకల వలెనున్నాయి
ఉదయం వరకూ ఆగి నీ నగర సౌందర్యాన్ని
వెలుగులో చూస్తాను ప్రభూ!

323
నేను బాధపడ్డాను. నిరాశచెందాను.
మృత్యువుని చూసాను.
నీ ఘనమైన లోకంలో ఉన్నందుకు
సంతోషంగా ఉంది ప్రభూ!

324
నా జీవితంలోని కొన్ని ప్రదేశాలు ఖాళీగానూ
మౌనంగానూ ఉండేవి
నా తీరికలేని రోజులకు గాలినీ వెలుతురునూ
అందించిన ఆరుబయళ్ళవి

325
నన్ను పట్టుకొని నా మృత్యువుని నిలుపుచేసే
నా అసంపూర్ణ గతం నుండి నన్ను విముక్తుడిని చేయి ప్రభూ!

326
నీ ప్రేమలో నాకు విశ్వాసము ఉందనేదే
నా చివరి మాట

✤

బొల్లోజు బాబా

తల్లిదండ్రులు	బొల్లోజు బసవలింగం, అమ్మాజి
సహచరి	సూర్య పద్మ
పిల్లలు	అపరాజిత, బసవ శ్రీధర్
చదువు	M.Sc., B.Ed., M.Phil.
వృత్తి	జువాలజీ అధ్యాపకుడు
రచనలు	**యానాం విమోచనోద్యమం** (2007) **ఆకుపచ్చని తడిగీతం** (2009) కవితా సంపుటి) **ఫ్రెంచిపాలనలో యానం** (2012) **వెలుతురు తెర** (కవిత్వం) 2016
ఇ.బుక్స్	**'ఎడారి అత్తరులు'** (ప్రముఖ సూఫీకవుల గీతాల అనువాదాలు) **ఇరవై ప్రేమకవితలు ఒక విషాదగీతం** (Twenty Love Poems and a Song of Despair, Pablo Neruda , తెలుగులో) **గాథాసప్తశతి-కొన్ని అనువాదాలు** (నాకు నచ్చిన కొన్ని గాథల అనువాదం) **వివిధ పుస్తకాల పరిచయ వ్యాసాలు** (పై ఇ.బుక్కు లభించు వెబ్ చిరునామా: http://www.scribd.com/bollojubaba)
బ్లాగు	http://sahitheeyanam.blogspot.com/
అవార్డులు	ఆకుపచ్చని తడిగీతం పుస్తకానికి శిలపరశెట్టి సాహితీ ప్రత్యేక పురస్కారం -2010 కళాలయ సాంస్కృతిక సంస్థ, పాలకొల్లు వారిచే సాహితీపురస్కారం 2012

Swetcha Vihangalu

Telugu Transilation of 'Stray Birds'
of Ravindranath Tagore

-Bolloju Baba

"ఇప్పుడు మీ చేతుల్లో ఉన్న 'స్వేచ్ఛా విహంగాలు' తెలుగులో ఇంతదాకా వచ్చిన టాగోర్ అనువాదాల్లో మహనీయమైన వాటి సరసన నిలవగలిగే సామర్థ్యాన్ని సంతరించుకుందని చెప్పగలను.

ఇందుకు, రెండు కారణాలు. ఒకటి నేను ముందే చెప్పినట్టు బొల్లోజు బాబా కవిత్వోపాసకుడైనందుకు. రెండవది, ఇప్పటి కాలానికీ, కవులకీ అవసరమైన ఒక విషయాన్ని గుర్తుచేసినందుకు.

ఇప్పటి కవులకి ధారాళమైన అభివ్యక్తి అయితే ఉందిగాని, ఎక్కడ నోరారా పలకాలో, ఎక్కడ నిగ్రహించుకోవాలో వారికి తెలియడం లేదు. కొన్ని తంత్రుల్ని మీటుతూనే, కొన్ని తంత్రుల్ని అదిమిపట్టినప్పుడే, వీణ సంగీతం పలికిస్తుంది. స్వరతంత్రుల్నీ, హృదయతంత్రుల్నీ ఎక్కడ అదిమిపట్టుకోవాలో, ఎక్కడ విడిచిపెట్టాలో తెలియడమే కవిత్వకళ. గోదావరీతీరంలో నన్నయనుండి ఇస్మాయిల్ దాకా ఈ పద్యవిద్య గురించే మాట్లాడుతూ వచ్చారు. ఇప్పుడు మరొకసారి టాగోర్ పేరిట బొల్లోజు బాబా మనకి గుర్తు చేస్తున్నదిదే.

అనువాదకుడిగా ఆయన ఇందులో చూపిన ప్రజ్ఞకి ఎన్నో ఉదాహరణలివ్వవచ్చు. ముఖ్యంగా ఆ క్లుప్తతనూ, గాఢతనూ అంతే పదిలంగా తెలుగులోకి పొదివిపట్టి తెచ్చుకోగలిగాడు."

వాడ్రేవు చినవీరభద్రుడు

స్వేచ్ఛా విహంగాలు విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ తెలుగు అనువాదం: బొల్లోజు బాబా